ప్రజాశక్తి
మంగళవారం 15 అక్టోబరు, 2024
5
శ్రీకాకుళం

వెయిట్ లిఫ్టింగ్‌లో వర్షితకు గోల్డ్ మెడల్

బంగారు పతకం సాధించిన వర్షిత

శ్రీకాకుళం అర్బన్: గార మండలంలోని ఆడవరానికి చెందిన గుజ్జల వర్షిత హిమాచల్ ప్రదేశ్‌లో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో బంగారు పతకాన్ని సాధించింది. ఈ పోటీల్లో 42 మంది వెయిట్ లిఫ్టర్లు హాజరు కాగా, 103 కేజీల విభాగంలో ఆమె బంగారు పతకాన్ని దక్కించుకుంది. తెలుగు రాష్ట్రాల నుంచి ఫైనల్‌కు చేరిన ఆమె జాతీయ స్థాయిలో రాణించింది. 2023లో అరుణాచల్‌ప్రదేశ్‌లో, తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో నిర్వహించిన జాతీయస్థాయి ఖేల్ ఇండియా పోటీల్లో మూడు గోల్డ్ మెడల్స్, నాలుగు సిల్వర్ మెడల్స్‌ను సాధించి ఆమె, ఇప్పుడు సబ్ జూనియర్స్ విభాగంలో రాణించింది.

ఒకరిది లక్... సిండికేట్లదే కిక్

- ఐదు నుంచి పదేసి షాపులను దక్కించుకున్న వ్యాపారులు
- 24 దుకాణాల్లో మహిళల పాగా
- కోటబొమ్మాళికి చెందిన మహిళకు నాలుగు దుకాణాలు
- ముగిసిన మద్యం దుకాణాల లాటరీ
- పారదర్శకంగా షాపుల కేటాయింపు : కలెక్టర్

మద్యం దుకాణాల లాటరీలో లక్ ఒకరిని వరించినా, సిండికేట్లకు మాత్రం ఏదో ఒక చోట షాపులు దక్కాయి. భారీగా దరఖాస్తులు సమర్పించడంతో వారికి ఎక్కడో ఒక చోట దుకాణం వచ్చింది. ఒకట్రెండు చోట్ల మాత్రం సిండికేట్లు దెబ్బతిన్నారు. దరఖాస్తు చేసిన వాటిలో ఒక్కటినీ సొంతం చేసుకోలేకపోయారు. ఆమదాలవలస ప్రాంతానికి చెందిన సిండికేట్లు 40 దరఖాస్తులు వేసినా ఒక్కటీ పొందలేకపోయారు. సంతబొమ్మాళి మండలంలో 130 మంది దరఖాస్తు చేయగా, ఏడు షాపులు దక్కించుకున్నారు. 12 మంది రెండేసి దుకాణాలను చేజిక్కుంచుకున్నారు. లాటరీలో మహిళలనూ లక్కు వరించింది. 24 దుకాణాల్లో వారు పాగా వేశారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలోని 158 మద్యం దుకాణాలకు స్థానిక అంబేద్కర్ కళావేదికలో అధికారులు సోమవారం లాటరీ నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటలకే ఈ ప్రక్రియను ప్రారంభించారు. తొలుత జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ లాటరీ ప్రక్రియను ప్రారంభించారు. కొద్దిసేపటి తర్వాత కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ భాగస్వామ్యమయ్యారు. మద్యం షాపుల లైసెన్స్‌ల కోసం జిల్లాలోని 12 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 4,671 దరఖాస్తులు వచ్చాయి. వాటిని స్టేషన్ల వారీగా లక్కీడిప్ చేపట్టారు. తొలుత శ్రీకాకుళం ఎక్సైజ్ స్టేషన్‌తో మొదలుపెట్టారు. గెజిట్ నంబరు ప్రకారం దుకాణానికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయో వాటి సంఖ్యకు అనుగుణంగా డబ్బాలో టోకెన్లు వేసి అధికారులు లాటరీ తీశారు. మొదట వచ్చిన టోకెన్ నంబరు ఉన్న వ్యక్తిని విజేతగా ప్రకటించి, రిజర్వులో ఉంచేందుకు మరో రెండు టోకెన్లు తీసి వారిద్దరి పేర్లను ప్రకటించారు.

సిండికేట్లకే దక్కిన షాపులు

మద్యం లాటరీలో సిండికేట్ వ్యాపారులే మద్యం దుకాణాలను చేజిక్కించుకున్నారు. టెక్కలి నియోజకవర్గానికి సంబంధించి అంతా అనుకున్నట్లుగానే టిడిపికి చెందిన ముఖ్య ప్రజాప్రతినిధి అనుచరులే అధిక శాతం దుకాణాలను దక్కించుకున్నారు. కోటబొమ్మాళి మండలానికి చెందిన ఓ టిడిపి నాయకుడి సతీమణి కింజరాపు పుష్పలత ఏకంగా నాలుగు షాపులను దక్కించుకోవడం గమనార్హం. నరసన్నపేట, పలాస నియోజకవర్గాల్లోనూ ముఖ్య ప్రజాప్రతినిధి అనుయాయులు షాపులను చేజిక్కించుకున్నారు. నరసన్నపేటలోని షాపు నంబరు 74ను భైరి మోహిని దక్కించుకోగా, ఈమె స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి బంధువని తెలిసింది. పలాసలో అత్యధిక షాపులను ముఖ్య ప్రజాప్రతినిధికి చెందిన వ్యక్తులు సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది.

లాటరీ తీస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఆ సిండికేట్లకు నిరాశే

లాటరీలో కొంతమందికి నిరాశే మిగిలింది. శ్రీకాకుళం మండలం ఒప్పంగికి చెందిన వైసిపి నాయకుడు 40 మందితో దరఖాస్తు చేయించినా ఒక్కటీ దక్కలేదు. గతంలో మద్యం వ్యాపారంలో సిండికేట్ వ్యాపారాలు చేసిన ఓ వైన్స్ షాపు వ్యాపారి 90 దరఖాస్తులు వేయగా, వారికి మూడే దక్కాయి.

కొందరికి కలిసొచ్చిన లాటరీ

సంతబొమ్మాళి మండలం నౌపడకు చెందిన టిడిపి నాయకులు గ్రూపుగా ఏర్పడి 130 దరఖాస్తులు చేశారు వారికి నౌపడ, సంతబొమ్మాళి, కవిటి తదితర ప్రాంతాల్లో ఏడు దుకాణాలు దక్కాయి.

బిజెపి ఎమ్మెల్యేకు శ్రీకాకుళంలో దుకాణం

జిల్లాలోని మద్యం దుకాణాలకు ఇతర జిల్లాల నుంచి చాలామంది మద్యం వ్యాపారులు దరఖాస్తు చేసుకున్నారు. అందుల్లో కొందరికి లక్కు వరించడంతో షాపులను సొంతం చేసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తికి చెందిన బిజెపి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఏడో నంబరు దుకాణాన్ని దక్కించుకున్నారు. ఎన్నికల ముందు వరకు ఆయన టిడిపిలో ఉన్నారు.

24 దుకాణాల్లో మహిళలు పాగా

మద్యం లాటరీలో మహిళలు 24 చోట్ల షాపులను దక్కించుకున్నారు. కోటబొమ్మాళికి చెందిన కింజరాపు పుష్పలత మూడు దుకాణాలు పొందారు. ప్రముఖ వైద్యులు దానేటి శ్రీధర్ సతీమణి దానేటి రాధారాణి బూర్జ మండలంలోని 40వ నంబరు దుకాణం దక్కించుకున్నారు.

కోలాహలంగా అంబేద్కర్ కళావేదిక

లాటరీ సందర్భంగా స్థానిక అంబేద్కర్ కళావేదిక ప్రాంతం కోలాహలంగా కనిపించింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దరఖాస్తుదారులు, వారి మద్దతుదారులతో ప్రాంగణం కిటకిటలాడింది. కళావేదిక బయట టెంట్లలో తమవంతు కోసం ఆశావహులు ఉత్కంఠతో ఎదురుచూడడం కనిపించింది. లాటరీలో తమ వారి పేరు రావడంతో ఈలలు వేస్తూ ఆనందం పంచుకున్నారు. దుకాణాలు పొందలేని వారు, అనుకున్న దుకాణాలు రానివారు నిరాశతో వెనుదిరిగారు.

అధికారుల తడబాటు

మద్యం దుకాణాలకు లక్కీడిప్ నిర్వహిస్తున్న సందర్భంలో అధికారులు రెండుసార్లు తడబడ్డారు. ఎల్‌ఎన్‌పేట, నరసన్నపేట దుకాణాలకు సంబంధించి టోకెన్ నంబర్ల ప్రకటనలో పొరపాటు పడ్డారు. టోకెన్ నంబరు ఆరుకు బదులుగా తొమ్మిదని చెప్పడంతో కొంత గందరగోళం నెలకొంది. జరిగిన పొరపాటుపై అధికారులు వివరణ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. లాటరీ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పారదర్శకంగా మద్యం షాపుల కేటాయింపు

జిల్లాలో 158 మద్యం షాపులకు 158 మంది లైసెన్స్‌దారులను ఖరారు చేసినట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. శ్రీకాకుళం నగరంలోని స్థానిక అంబేద్కర్ కళావేదికలో సోమవారం దరఖాస్తుదారుల సమక్షంలో మద్యం షాపులకు లాటరీ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారదర్వకంగా లాటరీ ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి, జిల్లా సూపరింటెండెంట్ తిరుపతి నాయుడు, ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూష, తహశీల్దార్ గణపతిరావు, ఎక్సైజ్ శాఖ సిఐలు, ఎస్‌ఐలు, తదితరులు పాల్గొన్నారు.

హాజరైన దరఖాస్తుదారులు

అనుచరులతో వచ్చిన పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

ధర్నా చేస్తున్న గ్రేడ్-3 ఎఎన్‌ఎంలు

హెల్త్ సెక్రటరీలకు ఉద్యోగోన్నతి కల్పించాలి

డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద గ్రేడ్-3 ఎఎన్‌ఎంల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గ్రామ, వార్డు సచివాలయాల్లో హెల్త్ సెక్రటరీలుగా పనిచేస్తున్న గ్రేడ్-3 ఎఎన్‌ఎంలను రెగ్యులర్ ఎఎన్‌ఎంలుగా ఉద్యోగోన్నతులు కల్పించడంతో పాటు వైద్యారోగ్యశాఖకు బదలాయించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డి.సాయిప్రసాద్, ఎపి యునైటెడ్ విలేజ్ అండ్ వార్డు హెల్త్ సెక్రటరీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై ఎపి యునైటెడ్ విలేజ్ అండ్ వార్డు హెల్త్ సెక్రటరీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీలు జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థలో హెల్త్ సెక్రటరీలకు పూర్తిస్థాయి డిడిఒ అధికారాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీనియార్టీ జాబితాలు తయారు చేసి ఎంపిహెచ్‌ఎ(ఎఫ్)లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. ఎటువంటి పైరవీలకు తావు లేకుండా చూడాలని కోరారు. వైద్యారోగ్యశాఖలో పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బందికి ఎఫ్‌ఆర్‌ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 152 జిఒ ప్రకారం మెటర్నిటీ లీవును డెలివరీ తేదీ నుంచి కాకుండా, అప్లై చేసిన తేదీ నుంచి మంజూరు చేయాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు ఉద్యోగంలో చేరినప్పట్నుంచి ట్రెజరీ అభ్యంతరాలతో సరెండర్ లీవ్ పొందలేకపోయారని, లీవు ఎన్‌క్యాష్‌మెంట్‌కు ట్రెజరీకి ప్రభుత్వం తగిన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 101 జిఒ ప్రకారం యూనిఫామ్ అలవెన్స్ సౌకర్యాన్ని ఆరోగ్య కార్యదర్శులకు అమలు చేయాలని, ఇంటెన్సిఫైడ్ జిఎన్‌ఎం శిక్షణ పూర్తి చేసిన వారికి 115 జిఒను వెంటనే అమలు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ధర్నా అనంతరం జిల్లాపరిషత్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సిఐటియు ఉపాధ్యక్షులు బి.మురళి, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ప్రభావతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సిహెచ్.రాధిక, కోశాధికారి ఎ.రాజ్యం, నాయకులు మెర్సీ, విశాలాక్షి, దమయంతి, లక్ష్మీతులసి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా ఏర్పడిన అల్పపీడన ద్రోణి దృష్ట్యా జిల్లాలో విస్తారంగా వర్షాలు, ఈదురుగాలుల ప్రభావం ఉంటున్న వాతావరణశాఖ హెచ్చరికలతో విద్యుత్‌శాఖ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు ఇపిడిసిఎల్ ఎస్‌ఇ ఎన్.కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం డివిజన్‌లో 9490610045, టెక్కలి డివిజన్‌లో 8332843546, పలాస డివిజన్‌లో 7382585630, పాలకొండ డివిజన్‌లో 8332843546 నంబర్లతో హెల్ప్ డెస్క్‌లు పనిచేస్తాయని తెలిపారు. విద్యుత్ సరఫరాలో లోపాలు, ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు, వైర్లు వేలాడినా, పడిపోయినా సంబంధిత డివిజన్ హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు. విద్యుత్ స్తంభాలను తాకడం, వేలాడుతున్న వైర్లను పట్టుకోవడం, వాటి కింద నడవడం, వైర్లపై చెట్ల కొమ్మలు పడిన చెట్లను తాకడం చేయకూడదని తెలిపారు. మరిన్ని వివరాలను శ్రీకాకుళం సర్కిల్ కార్యాలయం హెల్ప్ డెస్క్ 9490612633, ఎపిఇపిడిసిఎల్ టోల్ ఫ్రీ నంబరు 1912ను సంప్రదించాలని సూచించారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రగతికి అండగా పల్లె పండగ

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

పల్లెలు అభివృద్ధి చెందాలన్న ఆలోచనతో కూటమి ప్రభుత్వం పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమం చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అందులో భాగంగా టెక్కలి పట్టణంలో ఒక్కరోజే సుమారు రూ.నాలుగు కోట్ల విలువైన మూడు పనులకు శంకుస్థాపనలు చేసినట్లు తెలిపారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఆయన టెక్కలి జిల్లా ఆస్పత్రిలో రూ.35 లక్షల అంచనా వ్యయంతో సిసి రోడ్డు పనులకు, అయ్యప్ప నగర్‌లో రూ.1.80 కోట్లతో సిసి రోడ్డుకు, మండాపురం కాలనీలో రూ.1.82 కోట్ల అంచనా వ్యయంతో సిసి రోడ్డు, డ్రైనేజీ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో భాగంగా తొలుత సిసి రోడ్లు, డ్రెయిన్ల వంటి పనులకు ప్రాధాన్యత ఇచ్చి ప్రజా అవసరాలకు తగిన విధంగా మిగిలిన పనులనూ పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించామని వివరించారు. రానున్న వారం రోజుల పాటు పండగ వాతావరణంలో పల్లె పండగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టెక్కలిని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. తొలుత జిల్లా ఆస్పత్రిలో పలు విభాగాలను పరిశీలించారు. రిసెప్షన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన మూడు వరుసల కుర్చీలను ప్రారంభించారు. పారిశుధ్య పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకుడుగుంతలు నిర్మించాలని, గ్రీనరీ పనులను చేపట్టాలని, ఆస్పత్రి పేరుతో గ్లో సైన్ లైటింగ్ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. టెక్కలిలో టిటిడి కళ్యాణ మండపం ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, తహశీల్దార్ దిలీప్ చక్రవర్తి, ఎంపిడిఒ సిహెచ్.లక్ష్మీబాయి, ఎంపిపి ఎ.సరోజనమ్మ, వంశధార ప్రాజెక్టు ఇఇ శేఖర్, పంచాయతీరాజ్ ఎఇ నాయుడు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరి వరప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు, కె.రవికుమార్, కె.కామేశ్వరరావు పాల్గొన్నారు.

భూముల రికార్డులను సరిచేయాలి

- కలెక్టర్‌ను కోరిన రైతులు
- 'మీకోసం'లో 126 వినతులు స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

భూముల రీ సర్వే అనంతరం ఆన్‌లైన్‌లో వన్‌బి, అడంగల్‌లో తమ పేరుతో కనిపించడం లేదని వజ్రపుకొత్తూరు మండలం మెట్టూరు, నగరంపల్లికి చెందిన పలువురు రైతులు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఫిర్యాదు చేశారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)లో జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్‌తో కలిసి వినతులను స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా పలు సమస్యలపై మొత్తం 126 వినతులు వచ్చాయి. రీ సర్వేకు ముందు వన్‌బి, అడంగల్ తమ పేరుతో వచ్చేవని, రీ సర్వేలో రెవెన్యూ, సర్వే ఉద్యోగులు తారుమారు చేశారని రైతులు బి.రామారావు, శేషయ్య, రామకృష్ణ తదితరులు ఫిర్యాదు చేశారు. తమ భూముల రికార్డులను మార్చి వేరే వ్యక్తుల పేరుతో వన్‌బి, అడంగల్ వస్తున్నాయని, వాటిని సరిచేయాలని కోరారు. నందిగాం మండలం కొండూరు, హరిదాసుపురంలో కొన్ని భూములను చుక్కల భూముల జాబితాలో చేర్చారని, వాటిని సరిదిద్ది తమకు న్యాయం చేయాలని బి.వరదారావు వినతిపత్రం అందజేశారు. పూర్వీకుల నుంచి సంక్రమించిన తన భూములను ప్రభుత్వ భూములుగా చూపిస్తూ 22-ఎలో చేర్చారనికంచిలి మండలం గోకర్ణపురానికి చెందిన భీమారావు ఫిర్యాదు చేశారు. అంగవైకల్యం ఉన్న తన పెన్షన్‌ను రెండేళ్ల కిందట రద్దు చేశారని, అనేకమార్లు సచివాలయం చుట్టూ తిరిగినా ఇంతవరకు సరిచేయలేదని శ్రీకాకుళం నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన బబిత ఫిర్యాదు చేశారు. పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లో వరికి సుడిదోమపోటు వల్ల పంటలు నష్టపోతున్నారని, ఏటా నష్టం వాటిల్లినా పరిహారం మాత్రం అందడం లేదని మందస రైతాంగ పోరాట సమితి నాయకులు ఫిర్యాదు చేశారు. సుడిదోమ వల్ల తెగుళ్లు ఆశించిన ప్రాంతాల్లో వ్యవసాయాధికారులు క్షేత్ర పరిశీలన చేపట్టాలని కోరారు.

వినతుల స్వీకరణ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరిస్తున్న వినతులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పారదర్శకంగా విచారణ చేసి ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ లక్ష్మణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి కె.భారతీసౌజన్య, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వి ప్రసాదరావు, బిసి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శాంతిశ్రీ, డ్వామా పీడీ బి.సుధాకరరావు, డిసిహెచ్‌ఎస్ కళ్యాణ్‌బాబు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అభివృద్ధిని ఓర్వలేక దుష్ప్రచారాలు

ఎమ్మెల్యే రవికుమార్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

కూటమి ప్రభుత్వ 120 రోజుల పాలనలో జరిగిన అభివృద్ధితో ప్రజల ఆదరాభిమానాలను చూసి ఓర్వలేని వైసిపి నాయకులు దుష్ప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్యే కూన రవికుమార్ విమర్శించారు. మండలంలోని మర్రిపాడు, సుభద్రాపురం, పెద్ద వెంకటాపురంలో రూ.1.29 లక్షల ఉపాధి హామీ నిధులతో చేపట్టనున్న సిమెంట్ రహదారులు, డ్రైనేజీల నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మర్రిపాడులో నిర్వహించిన సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ ఆమదాలవలస పట్టణానికి చెందిన వైసిపి నాయకుడు ఇసుక, లిక్కర్ మాఫియాలకు ఆమదాలవలస అడ్డాగా మారిందంటూ కారుకూతలు కూశాడన్నారు. జిల్లాలో 158 మద్యం షాపులకు 4,659 దరఖాస్తులు రాగా, పారదర్శంగా లాటరీ ద్వారా షాపుల్ని ఎంపిక చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గతంలోనూ వెన్నెలవలస వద్ద కూన రవికుమార్ భూములు ఆక్రమించాడంటూ పెద్ద తమ్మినేని, పిల్ల తమ్మినేని, కొంతమంది వైసిపి నకిలీ నాయకులు ఆరోపణలు చేశారని చెప్పారు. ఐదేళ్ల వైసిపి పాలనలో ఎందుకు విచారణ చేపట్టలేదని ప్రశ్నించారు. అప్పుడు వీరందరూ గాడిదలు కాశారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.లక్షల కోట్ల అక్రమాస్తులే లక్ష్యంగా పరిపాలన సాగించిన జగన్, గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధికి ఏరోజూ చర్యలు చేపట్టలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వ పాలనలో రూ.4,600 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో సిసి రహదారులు, డ్రైనేజీలు నిర్మిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.పావని, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, టిడిపి నాయకులు శివ్వాల సూర్యనారాయణ, నందివాడ గోవిందరావు, తాడేల రాజారావు, తర్లాడ సురేంద్ర, ఎంఎంఎస్ అధ్యక్షులు పేడాడ మణి తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు లెక్చరర్లు

కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలి

శ్రీకాకుళం అర్బన్: ఎన్నికల కోడ్ వల్ల ఆగిపోయిన కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ వెంటనే ప్రారంభించి ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా కాంట్రాక్టు లెక్చర్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. ఇందులో భాగంగా నగరంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి కాంట్రాక్టు లెక్చరర్స్ సంఘం రాష్ట్ర నాయకులు బి.జె గాంధీ, దయాకర్ మాట్లాడారు. 24 ఏళ్లుగా పనిచేస్తోన్న తమ సర్వీసులను రెగ్యులర్ చేసేందుకు ఉద్దేశించిన జిఒ నంబరు 114ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు కూటమి నేతలు హామీనిచ్చారని గుర్తుచేశారు. వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. చిన్న సాంకేతిక కారణాలు, ఎన్నికల కోడ్ అడ్డంకుల వల్ల ఆగిపోయిన క్రమబద్ధీకరణ ప్రక్రియను త్వరితగతిన చేపట్టాలని కోరారు. లేకుంటే సత్యాగ్రహ దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు వెంకట్రావు, సరస్వతి, కింతలి లావణ్య, ఆబోతుల శ్రీనివాసరావు, శిరీష, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తూ ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - పాతపట్నం

ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా గుణుపూర్ నుంచి తమిళనాడు రాష్ట్రం చెన్నైకు గంజాయి రవాణా చేస్తున్న చెన్నైకి చెందిన అజయ్ కృష్ణమూర్తి, క్రీతేజ్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి 18.840 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పాతపట్నం అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పాతపట్నం సిఐ వి.రామారావు, ఎస్‌ఐ బి.లావణ్య సోమవారం వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో వీరు పట్టుబడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలను పాతపట్నం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎఎస్‌పి పి.శ్రీనివాసరావు వెల్లడించారు. అజయ్ కృష్ణమూర్తి, క్రీతేజ్ కుమార్ మద్యానికి, గంజాయికి అలవాటు పడ్డారు. వీరి అలవాటును ఆసరాగా చేసుకున్న చెన్నైకి చెందిన దినేష్ అనే గంజాయి వ్యాపారి వీరికి గుణుపూర్ నుంచి గంజాయి తీసుకొస్తే రూ.పది వేలు ఇస్తానని పంపించాడు. దీంతో వీరు గుణుపూర్ సమీపంలోని ఏజెన్సీ ప్రాంతంలో గౌతమ్ అనే వ్యక్తి వద్ద 18.840 కిలోల తొమ్మిది ప్యాకెట్ల గంజాయి కొని, చెన్నై వెళ్లడానికి పాతపట్నం అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద బస్సు దిగి నడుచుకుంటూ వస్తుండగా తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఎఎస్‌పి తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రతిరోజూ గమనిస్తూ ఉండాలన్నారు. చెడు అలవాట్లకు బానిసైతే వెంటనే మందలించి మార్చాలన్నారు. మాదకద్రవ్యాలు సేవిస్తే ఆరోగ్యానికి హానికరమన్నారు. ఎవరైనా గంజాయి తరలించినా, విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీట్లు తెరుస్తామని, రెండోసారి పట్టుబడితే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి ముఠాను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిఐ రామారావు, ఎస్‌ఐ లావణ్యను ఎస్‌పి మహేశ్వర రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

వివరాలను వెల్లడిస్తున్న ఎఎస్‌పి శ్రీనివాసరావు

వంద రోజుల్లో అభివృద్ధిని చూపించాం

ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని, ఆర్భాటమే తప్ప ఆచరణ లేదని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ-ఎ కాలనీలోని ఆయన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో ప్రజా సంతృప్తికర పాలన అందించామన్నారు. వైసిపి పాలనలో రహదారులన్నీ గుంతలమయ్యాయని, కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి చేస్తుంటే కళ్లకు గంతలు కట్టుకున్నారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస రోడ్డును పూర్తి చేయకుండా వదిలేసిందన్నారు. కోడిరామ్మూర్తి స్టేడియం నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని క్రీడాకారులను మోసం చేసి పాలాభిషేకాలు చేయించుకున్న పాపం ధర్మాన సోదరులకే దక్కుతుందన్నారు.

640 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - కొత్తూరు

మండలంలోని కర్లెమ్మ పంచాయతీలో గల లక్ష్మీనారాయణ మోడ్రన్ రైస్‌మిల్లు నుంచి ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడికి అక్రమంగా తరలిస్తున్న రూ.14,72,607 విలువ గల 640 బస్తాల పిడిఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసే వ్యాపారులు రైస్‌మిల్లుకు అమ్ముతుండగా, ఆ బియ్యాన్నే పాలిష్ చేసి విక్రయిస్తుంటారు. రేషన్ బియ్యం లారీలో అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న విజిలెన్స్ సిఐ డి.వి.వి సతీష్ కుమార్, సిఎస్ డిటి భీమారావు, సిబ్బంది నివగాం రహదారిలోని నీలమణి అమ్మవారి ఆలయం వద్ద దాడి చేసి పట్టుకున్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సరుబుజ్జిలి ఎం.ఎల్.ఎస్ పాయింట్‌కు అప్పగించారు. లారీని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రైస్‌మిల్లు యజమాని తంగుడు శివశంకర్ కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.ఎ అహ్మద్ తెలిపారు.

లారీని స్వాధీనం చేసుకున్న అధికారులు

ప్రగతి కోసమే పల్లె పండగ

కవిటి : శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అశోక్

పోలాకి : శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

వజ్రపుకొత్తూరు : శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

రణస్థలం రూరల్: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

అబివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే బెందా: అశోక్ అధికారులను ఆదేశించారు. పల్లె పండగ సందర్భంగా మండలంలోని రూ.38 లక్షలతో కేశుపురం, రూ.35 లక్షలతో బూర్జపాడు పంచాయతీ డొంకూరులో సిసి రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, మాజీ ఎంపిపి ఢిల్లీరావు, సహదేవు, కామేశ్వరరావు, నరేంద్రరెడ్డి, ప్రసాద్, రెయ్యి సోమేష్, దుర్యోధన, భీమరాజు, నీలాద్రి, సూర్యనారాయణ, లోకనాథం, ఎంపిడిఒ రామారావు పాల్గొన్నారు.

కవిటి: పల్లెల అభివృద్ధితో పంచాయతీల పురోగతి జరుగుతుందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. పల్లె పండగలో భాగంగా మండలంలోని నెలవంక, కపాసుకుద్ది గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, టిడిపి నాయకులు బాసుదేవ్ ప్రధాన్, బెందాళం తిరుమల, హరికృష్ణ బిసాయి, హేమాదాస్, బాలరాజు, సీపాన వెంకటరమణ, బార్ల చినబాబు పాల్గొన్నారు.

పోలాకి : పల్లె పండగలో భాగంగా ఉపాధి హామీ నిధులు రూ.50 లక్షలతో ఉరజాం నుంచి నర్సాపురం వరకు, రూ.38 లక్షలతో రహిమాన్‌పురం సిసి రోడ్డు, డ్రెయిజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఎం.వెంకట అప్పలనాయుడు, టి.భూషణరావు, పూజారి సోమేశ్వరరావు, సనపల సోమేశ్వరరావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : గ్రామాల్లో పల్లె పండగలో భాగంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని పల్లిసారథి పంచాయతీ రూ.31 లక్షలు, డోకులపాడు పంచాయతీలో రూ.48 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సురాడ మోహనరావు, మాజీ సర్పంచ్ అంబటి రామకృష్ణ, రేయి గణపతి, దుష్యంత, విశ్వనాథం, ఎంపిడిఒ రమేష్‌నాయుడు, ఎపిఒ పిట్ట కేశవరావు పాల్గొన్నారు.

పాతపట్నం : పల్లె పండుగలో మండలంలోని చిన్నలోగిడి, పెద్దలోగిడి, లాబర, పేడూరు, పేడూరు, బొమ్మిక గ్రామాల్లో బిటి రోడ్డు నిర్మాణాలకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పైల బాబ్జి, సతీష్, బుద్దల నరేష్, బెజ్జపల్లి నీలకంఠం, రాంబాబు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : పల్లె ప్రగతి కోసం పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని మాజీ ఎంపిపి ఎస్.మోహనరావు అన్నారు. మండలంలోని జాడిపల్లి, బాణాపురం తదితర ప్రాంతాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఎంపిటిసి కదంబల సుజాత, పైడి రాజు, అగ్గాల శ్రీనివాసరావు, బాలరాజు, కార్యదర్శి మోహనరావు పాల్గొన్నారు.

మందస: మండలంలోని అంబుగాం, లహరి బంద, దున్నవూరు, బేతాళపురం, రాంపురం, బహడపల్లి పంచాయతీల్లో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. సిసి రోడ్లు, డ్రెయినేజీలు, శ్మశాన వాటికల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పైల సూర్యనారాయణ, ఎపిఒ హరికృష్ణ పాల్గొన్నారు.

పలాస : మండలంలోని రెంటికోట, అల్లుకోల, లొత్తూరు గ్రామాల్లో పల్లె పండగ నిర్వహించారు. అనంతరం రెంటికోటలో రూ.15 లక్షలు, లొత్తూరులో రూ.10 లక్షలు, అల్లుకోలలో రూ.10 లక్షల వ్యయంతో సిసి రోడ్డుకు ఎంపిడిఒ వసంతరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, సర్పంచ్ శాసనపురి తిరుమలరావు, పంచాయతీరాజ్ ఎఇ గోపయ్య పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: పల్లె పండగలో భాగంగా మండలంలోని చిట్టేవలస పంచాయతీలో సిసి రోడ్డు పనులకు పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, మాజీ ఎంపిపిలు వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, తర్ర రామకృష్ణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు నంబాళ శ్రీనివాసరావు, ఎంపిటిసి పట్ట సింహాచలం, మాజీ సర్పంచ్ శిమ్మ నారాయణరావు, ఇఒపిఆర్‌డి అంజిత్ పాల్గొన్నారు.

కొత్తూరు : పల్లె పండగలో భాగంగా మండలంలోని మెట్టూరు 1,2,3, నేరడి, నీలకంఠాపురం గ్రామాల్లో ఎంపిడిఒ నీరజ సిసి రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎఒ బి.రాంబాబు, ఎపిఒ ప్రేమలత, జెఇ దుర్గాప్రసాద్, సర్పంచ్ కె.శ్రీనివాసరావు, టిడిపి నాయకులు దశరథలు పాల్గొన్నారు.

సోంపేట : మండలంలోని కొర్లాంలో ఉపాధి హామీ కింద సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పల్లె పండగలో భాగంగా జెడ్‌పిటిసి మాజీ సభ్యులు సూరడ చంద్రమోహన్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో లైలావతి, వరలక్ష్మి, ఆర్.జానకిరావు, పి.సోమేష్, ఎస్.రామస్వామి పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: పల్లెల్లో అభివృద్ధిని కాంక్షిస్తూ గ్రామీణ ప్రాంతాల ప్రగతి కోసం పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలంలోని కిష్టప్పపేట, సింగుపురం, కరజాడ, బైరి తదితర ప్రాంతాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలకు పూర్వ వైభవం తెచ్చేందుకే పల్లె పండుగ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే శంకర్ వివరించారు. శ్రీకాకుళం నియోజకవర్గానికి సంబంధించి రూ.32 కోట్లతో రోడ్లు, కాలువలు ఇతర పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఆగస్టు 23న నిర్వహించిన గ్రామసభల్లో గుర్తించిన పనులను త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు రైతులకు ఉపయోగపడేలా అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శైలజ, కూటమి పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: మండలంలోని మహంతి పాలెంలో ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పల్లెలకు పూర్వ వైభవం తెచ్చేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కలిశెట్టి రామారావు, మైలపల్లి పోలీసు, మాత అప్పారావు, ముక్కు ఆదినారాయణ, గొర్లె అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

లావేరు: గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వం, సిఎం చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే ఎన్ఇఆర్ అన్నారు. పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా లోపెంట గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, పిన్నింటి మధుబాబు, ఆర్.ప్రకాశరావు, ఎంపిడిఒ వెంకటరాజు, అలుపాన సూర్యం, ఎర్ర సూర్యం, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పొందూరు: మండలం మలకాంలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో చేపట్టనున్న నిర్మాణ అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మీసాల మన్మథరావు, సర్పంచ్ జాడ శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు, ఎపిఒ శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి సింహాచలం, టిడిపి నాయకులు బాడాన శేషగిరి, అనకాపల్లి శ్రీరంగనాయకులు, బలగ శంకర భాస్కరరావు, సెక్రటరీ వెంకటేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కార్యక్రమంలో వచ్చే ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలని, చట్ట పరిధిలో చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్‌పి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తక్షణమే తెలియజేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు. ప్రజా పిర్యాదులపై నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని అధికారులను ఆదేశించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- సోంపేట

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. కంచిలి, సోంపేట మండలాల్లోని పలు ఉన్నత పాఠశాలల్లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 117 జిఒ రద్దు, కామన్ సర్వీస్ రూల్స్ సాధన వంటి సమస్యలతో ప్రభుత్వ ఉపాధ్యాయ రంగం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. వాటిని పరిష్కరించడం ద్వారా ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడే బాధ్యతను తీసుకుంటానని హామీ ఇచ్చారు. త్వరలో జరగబోవు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన అభ్యర్థిత్వానికి మద్దతు ఇచ్చి సహకరించాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిధరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు డి.గోవిందరావు పాల్గొన్నారు.

దీక్షలో పాల్గొన్న దొలాయిపుట్టుగ యువత

న్యాయం చేయాలి

ప్రజాశక్తి- కవిటి

తరగతి ధ్రువీకరణ పత్రాల మంజూరుకు 293 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని నియోజకవర్గంలోని బెంతు ఒరియాలు కోరారు. ఈ మేరకు సోమవారం దీక్షలో పాల్గొన్న దొలాయిపుట్టుగకు చెందిన యువకులు మాట్లాడుతూ తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో తమ బిడ్డల ఉన్నత చదువులు, యువత ఉద్యోగాలు కోల్పోతున్నట్టు తెలిపారు. తమకి తరగతి ధ్రువీకరణ పత్రాలు అందించాలని ప్రభుత్వాలకు, ప్రభుత్వ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వమైన తమ సమస్యపై సానుకూలంగా స్పందించి పూర్తి తరగతి, ఉప తరగతితో కూడిన ధ్రువీకరణ పత్రాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సంతోష్ సాహు, మున్నా దొలాయి, కేశవ్ దొలాయి పాల్గొన్నారు.

సర్వేయరు బాధ్యతల స్వీకరణ

హనుమంతురావు

నందిగాం : ఇటీవల బదిలీల్లో నందిగాం మండల రెవెన్యూ కార్యాలయానికి సర్వేయర్‌గా నియమితులైన హెచ్.హనుమంతరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన టెక్కలి సర్వేయర్‌గా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన సర్వేయర్ జోగారావు టెక్కలి ఏరియా ఆఫీస్‌కు బదిలీపై వెళ్లారు. నూతన సర్వేయర్‌కు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

సోలార్ రూఫ్ టాప్‌తో విద్యుత్ బిల్లు ఆదా

విద్యుత్‌శాఖ డిఇఇ రవికుమార్

సమావేశంలో మాట్లాడుతున్న డిఇఇ రవికుమార్

ఆమదాలవలస: ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకంలో భాగంగా సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకొనే సౌకర్యాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ డిఇఇ బి.రవికుమార్ అన్నారు. సోమవారం విద్యుత్ రూరల్ సెక్షన్ కార్యాలయంలో పిఎం సూర్యఘర్ యువజన పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత ఇల్లు ఉన్నవారు సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవడం వలన కలిగే లాభాలను ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. సోలార్ రూఫ్‌టాప్‌తో విద్యుత్ బిల్లును ఆదా చేసుకోవచ్చునని తెలిపారు. ఈ పథకంపై గ్రామాల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీతో సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ పథకం వలన గృహ వినియోగదారులకు అతి తక్కువ విద్యుత్ బిల్లు వస్తుందని, ఈ పథకానికి తక్కువ వడ్డీకి బ్యాంకు రుణాలు లభిస్తాయని తెలిపారు. మూడు కిలో వాట్లకు ప్రాజెక్టు విలువ రూ.2,06400 ఉండగా ప్రభుత్వం నుంచి సబ్సిడీ రూ.78 వేలు వస్తుందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ పథకాన్ని వినియోగదారులు వినియోగించుకొని విద్యుత్ ఛార్జీలను తగ్గించుకోవాలన్నారు. ఈ పథకం గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో రూరల్ ఎఇ బి. రవికుమార్, జెఇ రఘు, సబ్ ఇంజనీర్ మహేష్, లైన్ ఇన్‌స్పెక్టర్ రామారావు, లైన్‌మేన్‌లు రామస్వామి, గోవిందరావు, కృష్ణారావు, ఎనర్జీ అసిస్టెంట్లు, వినియోగదారులు పాల్గొన్నారు.

గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న సోమేశ్వరరావు

ముగిసిన ఎన్‌సిసి శిక్షణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో 14వ ఆంధ్రా బెటాలియన్ శ్రీకాకుళం ఆధ్వర్యాన ఈ నెల 5 నుంచి 14 వరకు జరిగిన కంబైండ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ (సిఎటిసి-6) సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఐతమ్ చైర్మన్ డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఎన్‌సిసి గౌరవవందనం స్వీకరించారు. శ్రీకాకుళం ఎన్‌సిసి బెటాలియన్ కమేండింగ్ ఆఫీసర్ కల్నల్ అమర్నాద్ సాహు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కల్నల్ ప్రసూన్ కుమార్ పండా, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. క్యాంపు ద్వారా విద్యార్థులు వ్యక్తిగత, సామాజిక అంశాలపై పూర్తి అవగాహన పొందారని కల్నల్ సాహ పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, సుబేదార్ మేజర్ సుభాషచంద్, క్యాంప్ కమేండింట్ మేజర్ వి.మహేశ్, అడ్యుటెంట్ కెప్టెన్ డాక్టర్ వై.పోలినాయుడు, ఐతమ్ ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ టి.మురళీమోహన్, కె.రవికుమార్, ట్రైనర్ భుజంగరావు వ్యవహరించారు.

శిక్షణను పరిశీలిస్తున్న జిసిడిఒ నీరజాక్షి

విద్యార్థి దశ నుంచే వృత్తి విద్య అవసరం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

విద్యార్థి దశ నుంచే వృత్తి విద్య అవసరమని శ్రీకాకుళం జిసిడిఒ నీరజాక్షి అన్నారు. మండలంలో కొండములగాం ఆదర్శ కళాశాలను సోమవారం ఆమె సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు కుట్టు మిషన్, ఎంబ్రాయిడరిపై దసరా సెలవుల్లో ఇచ్చిన శిక్షణ ద్వారా ఈ నూతన విద్యావిధానం ప్రకారం జనరల్ సబ్జెక్టులతో పాటు వృత్తి విద్య కూడా నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ పి.కృష్ణ శిక్షణ ఇచ్చారన్నారు. విద్యార్థులకు వృత్తి విద్య ఉపయోగాలు వివరిస్తూ సూచనలు చేశారు. వృత్తి విద్యా ఉపాధ్యాయులు కె.సూర్యకుమారిని అభినందించారు.

విద్యుత్ బిల్లులు చెల్లించలేం

విద్యుత్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న లాబాం గ్రామస్తులు

ప్రజాశక్తి- బూర్జ

వేలాది రూపాయల విద్యుత్ బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేయడం ఎంతవరకు సమంజసమని మండలం లాబాం గ్రామానికి చెందిన దళితులు సోమవారం స్థానిక విద్యుత్‌శాఖ ఎఇ అప్పన్నను ప్రశ్నించారు. 12 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం దళితులకు విద్యుత్ బిల్లులు ఉండవని స్పష్టం చేసిందని, ఆనాటి నుంచి నేటివరకు గ్రామానికి చెందిన 30 కుటుంబాలు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని తెలిపారు. అయితే గత కొద్దిరోజులుగా విద్యుత్‌శాఖ లైన్‌మేన్ గ్రామానికి వచ్చి మీరు తక్షణమే మీకు సంబంధించిన విద్యుత్ బిల్లులను చెల్లించాలని లేనిపక్షంలో ప్రభుత్వ పథకాలు అందవని హెచ్చరిస్తున్నారని తెలిపారు. ఇంతవరకు బిల్లులు చెల్లించాలని అధికారులు, సిబ్బంది అడగకుండా ఉండి గత కొద్ది రోజులుగా ఒక్కసారిగా వేలాది రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. దళితులమైన తాము బిల్లు చెల్లించే స్థితిలో లేమని వివరించారు. ప్రభుత్వ పథకాలను అందకుండా చేస్తామని బెదిరించడం సరికాదన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

దళితుల అభ్యున్నతికి అంబేద్కర్ కృషి

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఉన్న బుద్ధుని విగ్రహం వద్ద అశోక విజయదశమి బోధిసత్వ అంబేద్కర్ దిమ్మ దీక్షా దినోత్సవం సోమవారం నిర్వహించారు. ది బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు బొడ్డేపల్లి కృష్ణారావు బోధిసత్వ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. దళితుల అభ్యున్నతికి బాబాసాహెబ్ అంబేద్కర్ నాగ్‌పూర్‌లో బౌద్ధ దీక్ష సందర్భంగా చేసిన 22 ప్రతిజ్ఞలు చదివి వినిపించారు. కార్యక్రమంలో దళిత మహాసభ నాయకులు వడమ శ్రీనివాసరావు, టొంపల తిరుపతిరావు, బొడ్డేపల్లి రామకృష్ణ, మారెళ్ల రాజారావు, జయకృష్ణ, అంబేద్కర్, తలచంద్ర రాంబాబు, కల్లేపల్లి ఆనందరావు, జొన్న నారాయణరావు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన ట్రస్టు భూమి పరిశీలన

ప్రజాశక్తి- పొందూరు

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మధురెడ్డి, దేవాదాయ అధికారులు

మండల కేంద్రం అంబేద్కర్ కూడలి సమీపంలో సర్వే నెంబర్ 198లో శాలిహుండం వేణు గోపాలస్వామి ఆలయం ట్రస్టుకు సంబంధించిన విలువైన భూమిలో ఆక్రమణలను ట్రస్టు చైర్మన్ మధురెడ్డి, దేవాదాయ శాఖాధికారులు ప్రసాదబాబు, దుర్గాప్రసాద్‌లు సోమవారం పరిశీలించారు. జిల్లా దేవాదాయశాఖ ఎసి ప్రసాద్ పట్నాయక్ ఆదేశాలతో భూమికి సంబంధించిన పత్రాలతో ఆక్రమణ భూమిలో నందల వ్యాపారం నిర్వహిస్తున్న కె.భూలోకను నాలుగు రోజుల్లో ఖాళీ చేయాలని ఆదేశించారు. ఎటువంటి అనుమతి లేకుండా ట్రస్టు భూమిలో నిర్మించిన నిర్మాణానికి విద్యుత్ మీటర్ ఇచ్చిన ఎన్ఒసిని రద్దు చేయాలని పంచాయతీ ఇఒ మోహన్‌బాబుకు వినతిపత్రం అందించారు. తహశీల్దార్ కార్యాలయంలో . ఇన్‌ఛార్జి తహశీల్దార్ వెంకటేశ్వర్లుకు, ఎస్ఐ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. శాలిహుండం భూమిని ఆక్రమించిన వారిపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని ట్రస్టు చైర్మన్ మధురెడ్డి తెలిపారు.

బిల్లులు చెల్లించడం లేదు

మండల సమావేశంలో సభ్యుల నిలదీత

అధికారులను నిలదీస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

గత ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ వరిసాగు మొదలు పెట్టిన సమయానికే రైతులకు పెట్టుబడి సాయం అందేదని, ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వంలో వరిసాగు చివరిదశకు వచ్చినా పెట్టుబడిసాయం అందించలేదని దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎఒ ఎస్.గోవిందరావును సభ్యులు ధ్వజమెత్తారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి రోణంకి ఉమా మల్లేశ్వరరావు అధ్యక్షతన సోమవారం మండల సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పనులకు రానివారికి సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వకుండా ఇలా నియమిస్తారని ఎపిఒ జి.హరిప్రసాద్‌కు మసాహెబ్‌పేట సర్పంచ్ సంపతిరావు, హేమసుందరరాజు నిలదీశారు. అలాగే పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులు, పారిశుధ్య పనులు చేసినా, వాటికి సంబంధించిన బిల్లులు ఎందుకు చెల్లించటంలేదని అధికారులను ప్రశ్నించారు. మండలంలో 38 పంచాయతీలకు రూ.14.90 కోట్ల వ్యయంతో సుమారు 20 కిలోమీటర్ల సిసి రోడ్డుకు నిధులు మంజూరయ్యాయని సంబంధిత పంచాయతీరాజ్ ఇంజినీర్ అజిత్‌కుమార్ తెలిపారు. పంచాయతీల తీర్మానం లేకుండా పనులు ఎలా గుర్తించారని సభ్యులు ప్రశ్నించగా, కార్యదర్శులు ఇచ్చిన తీర్మానం ద్వారానే పనులు గుర్తించామని చెప్పారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం అధికారులు చెప్పకపోవడంతో చివరకు వాకౌటు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, వైస్ ఎంపిపి దుక్క రోజా, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- పాతపట్నం

శంకరరావు మృతదేహం

స్థానిక బాలాజీ నగర్‌లో ఉంటున్న గోరిశెట్టి శంకరరావు (40) ఇంట్లో ఉరి వేసుకుని సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు మేరకు... శంకరరావు స్థానిక అమ్మవారి ఆలయంలో మేకపోతులు వేట వేస్తూ జీవనం సాగిస్తున్నారు. మద్యానికి బానిస కావడంతో దసరా నుంచి ఎక్కువగా తాగడం ప్రారంభించారు. దీనిని గమనించిన భార్య, బావమరిది మందలించారు. దీంతో మనస్తాపానికి గురై అటుకు పై ఉన్న దూలానికి తువ్వాలతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు కిందకు దించి పరిశీలించగా... అప్పటికే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి పవన్, తేజ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

భవాని మృతి

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని కేశవరాయపాళెంలో శనివారం భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో భార్య భవాని మనస్తాపంతో ఆదివారం పురుగుల మందు తాగిన నాలుగు నెలల గర్భవతి భవాని శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతదేహానికి లావేరు పోలీసులు శవపంచ నామ నిర్వహించి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

భార్య, భర్తల మృతి విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు సోమవారం ఆకుటుంబాన్ని పరామర్శించారు. తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న చంటి రక్తదానం చేశాడని తన చేతులమీదుగా మెడల్, గుర్తింపు కార్డు ఇచ్చానని, ఇంతలో ఇలా భర్త, భార్యలు మృతి చెందడం కలిచి వేసిందన్నారు. పరామర్శించిన వారిలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, పలువురు కూటమి నాయకులు ఉన్నారు.

డిసెంబరు 14న లోక్ అదాలత్

ప్రసన్నలత, జడ్జి

కోటబొమ్మాళి: డిసెంబర్ 14న కోర్టు అవరణలో జరగనున్న జాతీయ లోక్ ఆదాలత్‌ను విజయవంతం చేయాలని మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, స్థానిక జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. అదాలత్‌లో అన్ని సివిల్, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు, మనోవర్తి కేసులు, భార్యాభర్తల కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తామని అన్నారు. ఈ అవకాశాన్ని న్యాయవాదులు, పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హరిపురం విద్యార్థుల సత్తా

మందస : వజ్రకొత్తూరు మండలం పెద్దమురారిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 11న నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీలో మండలంలోని హరిపురం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ విద్యార్థులు సత్తాచాటారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు జి.ఉమారాజ్, సర్పంచ్ జె.పురుషోత్తం, ఎంపిటిసి ఎ.అప్పన్న, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొంచాడ సురేష్ కుమార్, పిఎంసి వైస్ చైర్‌పర్సన్ మల్లెన హిమావతి, మార్పు ట్రస్టు చైర్మన్ ఎం.ఖగేశ్వరరావు సోమవారం అభినందనలు తెలిపారు. క్విజ్ పోటీల్లో పాల్గొవడం వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు.

ట్రోఫీని అందుకుంటున్న విద్యార్థులు

మహిళాభివృద్ధికి పెద్దపీట

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

డ్వాక్రాసంఘాల ఆవిర్భావం చంద్రబాబుతోనే సాధ్యమైందని, అదే స్ఫూర్తితో మహిళల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్ అన్నారు. సోమవారం నగరంలోని ఆదిత్య సమాఖ్య వార్షిక మహాసభ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. టిడిపి ఆవిర్భావం నుంచి మహిళలకు అత్యంత ప్రాధాన్యత నిస్తోందన్నారు. స్వర్గీయ ఎన్‌టిఆర్ మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్, ఆస్తిలో సమానహక్కు కల్పించారన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారన్నారు.

మాట్లాడుతున్న మాదారపు వెంకటేష్

కార్యక్రమంలో టిడిపి నాయకులు గండేపల్లి కోటేశ్వరరావు, బుర్రి మధు, గండేపల్లి దుర్గా భవాని, మెప్మా అధికారులు వెంకటరావు, సీత రాజు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలతో మాట్లాడుతున్న సన్యాసినాయుడు

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం

పాతపట్నం: జైలులో ఖైదీలుగా ఉన్న వారికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తుందని ఆ సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. పాతపట్నం సబ్ జైలును సోమవారం సందర్శించి, అక్కడున్న ఖైదీలతో మాట్లాడారు. వారికి అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ ద్వారా కేసుల పరిష్కారానికి ఉచితంగా సేవలు అందించనున్నట్లు తెలిపారు. న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్తోమత లేని వారు జిల్లా న్యాయసేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకుంటే లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్‌కు అందజేసి ఈ సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. ఆయన వెంట జైలు సూపరింటెండెంట్ జి.రాము, రవి, జైలు సిబ్బంది ఉన్నారు.

ఆర్థికసాయం అందిస్తున్న ప్రసాదరావు

విశ్రాంత డిఎస్‌పి ఔదార్యం

కవిటి: విశ్రాంత డిఎస్‌పి, జనసేన నాయకుడు జగతి గ్రామానికి చెందిన ఎస్.వి.వి. ప్రసాదరావు మరోసారి తన ఔదార్యం చాటుకున్నారు. జగతి పంచాయతీ బట్టివాని పాలెం గ్రామానికి చెందిన మదన్ తల సేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో రెక్కాడితే గాని డొక్కాడని మదన్ తండ్రి హేమరాజు ఆర్థిక పరిస్థితి తెలిసిన ప్రసాదరావు వారికి అండగా నిలిచారు. తన తల్లి దండ్రులైన బానమ్మ, రాములయ్య ట్రస్ట్ పేరు మీదుగా సోమవారం రాత్రి మదన్‌కి రూ.10 వేలు అందించారు. అదే విధంగా కూటమి తరుపున రూ.3వేలు అందించారు. నేతాజీ, గంతి శ్రీను, పూడి ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆర్థిక వృద్ధికి పక్కా ప్రణాళికలు

శ్రీకాకుళం: స్వర్ణాంధ్ర-2047 నాటికి ఆర్థిక వృద్ధిరేటు పెంచే దిశగా ప్రణాళికలు ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వెల్లడించారు. సోమవారం స్వర్ణాంధ్ర-2047పై మండల, జిల్లాల విజన్ ప్లానింగ్ పై జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుండి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు. శ్రీకాకుళం నుండి అత్యధికంగా సూచనలు వచ్చాయన్నారు. జిల్లా, మండల స్థాయి ఏక్షన్ ప్లాన్ సిద్ధం చేసి అందజేయాలన్నారు. ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు పర్యాటకం, వ్యవసాయం, హార్టీకల్చర్, పరిశ్రమలు, రవాణా రంగం, తదితరమైన ప్రాథమిక రంగాలపై ప్రణాళికలు తయారు చేసి ఆర్థికాభివృద్ధిని ప్రతీ జిల్లా 15 శాతం వృద్ధి రేటు సాధించే దిశగా ప్రణాళిక ఉండాలన్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ మండల స్థాయి నుండి ఇప్పటికే సమావేశం ఏర్పాటు చేయగా పెద్ద ఎత్తున ప్రజలు నుండి స్పందన వచ్చిందని వివరించారు. జిల్లాలో వ్యవసాయం, హార్టీకల్చర్, తదితర వాటి ద్వారా వృద్ధి రేటు సాధించే దిశగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. మూలపేట పోర్టు కూడా ప్రస్తుతం నిర్మాణం జరుగుతోందని, పోర్టు పూర్తి అయితే రాబోయే రోజుల్లో మరింత ఆర్థిక వృద్ధి రేటు సాధించవచ్చని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. అప్పారావు, ఆర్డీఓలు కె.సాయి ప్రత్యూష, ఎం. కృష్ణమూర్తి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. మీనాక్షి, ఎపిఈపిడిసిఎల్ ఎస్ఈ కృష్ణమూర్తి, ఆర్ అండ్ బి ఎస్ఈ జాన్ సుధాకర్, మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి బి. శాంతి శ్రీ, డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్, పరిశ్రమల శాఖ జిఎం విజయరత్నం, డిడి ఉమామహేశ్వరరావు, హౌసింగ్ ఇన్ ఛార్జ్ పీడీ జి. నగేష్, జెడిఏ సిఇఒ శ్రీధర్ రాజా, డిపిఒ కె.భారతి సౌజన్య, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సోంపేట : ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

పలువురికి ఆర్థికసాయం

బ్రాహ్మణ కుటుంబానికి చెందిన సన్యాసమ్మ పాడి ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఒరియా బ్రాహ్మణ అర్చక సంఘం సభ్యులు సోమవారం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. అనంతరం రూ.53 వేల 55 సన్యాసమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సింహాచలం పాడి, ఆనందరావు పాణిగ్రాహి, శంకరం పాణిగ్రాహి, గాంధీజీ పాణిగ్రాహి, కృష్ణ పాణిగ్రాహి, శ్రీనివాస పాడి పాల్గొన్నారు.

ప్రజాశక్తి- కవిటి

తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న మండలంలోని గొర్లెపాడుకు చెందిన బుర్ది శ్రీకాంత్‌కు జైహింద్ సేవా ఫౌండేషన్ అండగా నిలిచింది. తన వైద్యం కోసం రూ.4 లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పడంతో శ్రీకాంత్ దాతల సాయం కోసం ఎదురుచూశాడు. విషయం తెలుసుకున్న జైహింద్ ఫౌండేషన్ సభ్యులు సోమవారం గ్రామానికి చేరుకొని శ్రీకాంత్‌కు రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో జైహింద్ ఫౌండేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

సోంపేట : మండలంలోని కొత్త అగ్రహారంలోని నిరుపేద

కవిటి : నగదు అందిస్తున్న సభ్యులు

అక్కలనాయుడు సేవలు చిరస్మరణీయం

అక్కలనాయుడు విగ్రహానికి నివాళ్లర్పిస్తున్న క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి- పొందూరు

స్థానిక యంగ్‌స్టార్ యూత్ క్లబ్ వ్యవస్థాపక సభ్యులు అనకాపల్లి అక్కలనాయుడు మాస్టార్ ద్వితీయ వర్ధంతిని స్థానిక పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద సోమవారం యంగ్‌స్టార్ క్లబ్ అధ్యక్షులు కె.శాంతారాం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కల నాయుడు చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేగిడి లక్ష్మి, ఎంపిటిసి అనకాపల్లి వాణి, మాజీ సర్పంచ్ అనకాపల్లి విజయలక్ష్మి, క్లబ్‌సభ్యులు అట్ల మణి భూషణరావు, దండా సూరిబాబు, పెన్నం నానాజీ, గుడ్ల చంద్రశేఖర్, వాండ్రంగి కొండలరావు, కె.విజయ్‌కుమార్, ఎం.వి.రమణారావు, బి.జానార్ధనరావు, వై.గోపాలరావు, జి.జవహర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుని ఔదార్యం

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని రావ్వపేట ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమంతు శివానంద తన ఉదారాన్ని చాటుకున్నారు. ఈ మేరకు స్థానిక బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న గ్రంథాలయ నిర్వహణకు రూ.5 వేలు ఆర్థిక సహకారాన్ని సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.శోభారానికి అందజేశారు. ఆరో తరగతి నుంచి 11వ తరగతి వరకు విద్యార్థినీ విద్యార్థులు చదువుతున్న దృష్ట్యా వారికి అవసరమైన పుస్తకాలు కొనుగోలుకు విరాళాన్ని వినియోగించుకోవాలని కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు కుప్పిలి నగేష్, కోళ్ల చంద్రిక, నంబాల వాణిశ్రీ, సూర్యకాంతం అభినందించారు.

విరాళాన్ని అందిస్తున్న హెచ్‌ఎం శివానంద

అవార్డును ప్రదానం చేస్తున్న రామరాజు

విద్యా పురస్కారం ప్రదానం

ప్రజాశక్తి - పాతపట్నం

మండలంలోని తెంబూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చదువుల విశ్వనాథం అధ్యక్షతన స్థానిక రామరాజు ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు విద్యా పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ ఏడాది పదో తరగతిలో 561 మార్కులు సాధించిన విద్యార్థి కోట్ని శరణ్యకు రామరాజు సోమవారం ఈ పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు గౌరవాధ్యక్షులు, పూర్వ హెచ్‌ఎం దోకిపర్తి షణ్ముఖరావు జ్ఞాపకార్థం ఈ పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మన్ కె.నాగేశ్వరరావు, బందన శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ ఎస్.సుదర్శనరావు, వి.మల్లేశ్వరరావు, జి.భాస్కరరావు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న శ్రావణ్

ప్రజలకు అందుబాటులో ఉంటా..

బూర్జ: మండలంలోని మదనాపురం జంక్షన్ వద్ద పాతపాడు శివ దుర్గమ్మ ఆలయంలో అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీమంత్రి కిడారి శ్రావణ్ కుమార్ దుర్గమ్మను సోమవారం దర్శించుకున్నారు. తన పుట్టినరోజు సందర్భంగా ఈ దేవాలయానికి రావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి సేవలు అందిస్తుంద న్నారు. గిరిజన ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ఆరు గ్యారంటీలను సక్రంగా అమలు చేస్తామన్నారు. ఆయనతో పాటు కిడారి శ్రావణి, గొట్టుముక్కల కోటేశ్వర రావు, కర్నేన అప్పలనాయుడు, సాయికుమార్, ఆర్ట్స్ సంస్థ సిబ్బంది, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

పారిశుధ్యం లోపిస్తే చర్యలు

పలాస: పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో పారిశుధ్యం లోపిస్తే కఠినంగా చర్యలు ఉంటాయని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు కార్మికులకు హెచ్చరించారు. అన్నపూర్ణ ఆశ్రమం, కాశీబుగ్గ కెటి రోడ్ మురుగు కాలువ, పాత జాతీయ రహదారిలో నిర్మిస్తున్న ప్రయివేటు భవనాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ అనుమతులు లేకుండా నిర్మాణం చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో పాటు మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

పనులను పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ గోపీబాల

పక్కాగా పారిశుధ్య పనులు

కోటబొమ్మాళి: ప్రతి గ్రామంలోనూ పక్కాగా పారిశుధ్య పనులు నిర్వహించాలని టెక్కలి డిఎల్‌పిఒ గోపీబాల సూచించారు. స్థానిక రెడ్డిక వీధిలో చేపడుతున్న పనులను ఇఒపిఆర్‌డి జె.ఆనందరావుతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్య పనులు పూర్తిస్థాయిలో నిర్వహించకపోవడంతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని అన్నారు. అందుకు గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. స్థానిక పంచాయతీ ఇఒ చింతాడ సన్యాసిరావు పాల్గొన్నారు.

వాటర్ ఫిల్టర్ వితరణ

కవిటి: మండలంలోని కుసుంపురానికి చెందిన బత్తిని గోపాలరావు (ఎన్‌ఆర్ఐ) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు వాటర్ ఫిల్టర్‌ను వితరణగా అందించారు. గ్రామానికి చెందిన మాతృమూర్తి యువజన సంఘం ఆధ్వర్యాన ప్రధానోపాధ్యాయుడు త్రిలోచన బిసాయికి సోమవారం వాటర్ ఫిల్టర్ అందించారు.

వాటర్ ఫిల్టర్లను అందజేస్తున్న గోపాలరావు